క్లుప్తంగా

సజ్జలను కలిసిన వెలుగొండయ్య



సజ్జలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెలుగొండయ్య

పొదిలి: వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన తాళ్లపాక వెలుగొండయ్య శనివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి, పుష్ప గుచ్ఛం అందజేసి కృతజతలు తెలిపారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు ప్రతిగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి బీసీలను ఐక్యం చేసి పార్టీకి మద్దతు ఇచ్చేలా చేస్తానని వెలుగొండయ్య చెప్పారు. సజ్జలను కలిసిన వారిలో వెలుగోలు కాశీ, కాకునూరి సుబ్బారావు, టి.తిరుపతయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారాదానమ్మ శనివారం పట్టణంలోని సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి ప్రభుత్వం కల్పిస్తున్న వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతులు సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జైలు సూపరింటెండెంట్ లింగారెడ్డి, కోర్టు సిబ్బంది ఉన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేవే చలివేంద్రాలు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ కిరణ్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కమిషనర్ కిరణ్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో చలివేంద్రాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ డీఈ సుభానీ, మేనేజర్ శ్రీనివాసన్, ఏఈ ఆదినారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మినరల్ వాటర్‌తో చలివేంద్రాలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కుమ్మరాంకట్ట సెంటర్, రైల్వేస్టేషన్ సమీపం, పాత బద్వేల్ రోడ్డులో మూడు సెంటర్‌లలో శనివారం స్థానిక కమిషనర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మినరల్ వాటర్‌తో కూడిన చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రధాన వీధుల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

అబాకస్ పోటీ పరీక్షకు ఎంపికైన స్పందన విద్యార్థి



నజీర్ బాషాతో సుధీర్‌కుమార్‌రెడ్డి

రాచర్ల: హైదరాబాద్‌లో ఆదివారం జరగనున్న జాతీయ స్థాయి అబాకస్ పోటీ పరీక్షలకు రాచర్ల స్పందన విద్యాసంస్థల విద్యార్థి షేక్ నజీర్ బాషా ఎంపికైనట్లు ఆ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్‌కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. పాఠశాల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఎంపికయ్యాడని చెప్పారు. స్పందన విద్యాసంస్థల విద్యార్థులు ఇలాంటి విజయాలెన్నో సాధించాలని, వారి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి



నాగరాజుకుంటలో మాట్లాడుతున్న డీఎస్పీ అశోక్‌వర్ధన్

కొనకనమిట్ల: వచ్చే నెల 13న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఎన్నికల నియమాలను తూచా తప్పకుండా పాటించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని నాగరాజుకుంటలో పొదిలి సీఐ మల్లికార్జునరావు, ఎస్‌ఐ మాధవరావుతో కలిసి ఆయన ప్రజలకు శాంతి భద్రతల గురించి అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రజలు ఎలాంటి గొడవలు లేకుండా, క్షణికావేశాలకు పోకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలన్నారు. గ్రామాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే పోలీసు వారికి తెలియజేయాలని ఆయన ప్రజలను కోరారు.

జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి



గొల్లపల్లిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అన్నా, జంకె

తర్లుపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే అన్నా రాంబాబు స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం మండలంలోని గొల్లపల్లి, కారుమానుపల్లి, తర్లుపాడులో పార్టీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. గడప గడపలో అన్నా, జంకెకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి: జంకె

ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబును, ఎంపీ అభ్యర్థి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. గడిచిన ఐదేళ్ల సీఎం జగన్ పాలనలో మార్కాపురం నియోజకవర్గ అన్నీ విధాలా అభివృద్ధి చెందిందన్నారు. అన్నా రాంబాబు పేద ప్రజల కష్ట సుఖాలు తెలిసిన వ్యక్తి అని, పట్టణంలో నీటి సమస్య తీర్చేందుకు ట్యాంకర్లను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చారన్నారు. సీఎం పాలనలో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందన్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లిలో సొసైటీ చైర్మన్ రామిరెడ్డి, ఎంపీటీసీ పార్వతి రమేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి ఎమ్మెల్యే అన్నాను, జంకె వెంకటరెడ్డిని ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. కారుమానిపల్లిలో మండల పార్టీ అధ్యక్షుడు మురారి, సర్పంచ్ మీరయ్య, పార్టీ నాయకులు వెలుగొండారెడ్డి, శేషయ్య, దేవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. తర్లుపాడులో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జిల్లా జేసీఎస్ కన్వీనర్ రామచంద్రారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అక్బర్ అలీ, సర్పంచ్ పి.వరాలు, ఎంపీటీసీ అంకమ్మ, మాజీ ఎంపీపీ గాయం శ్రీనివాసరెడ్డి, వైస్ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఎబినేజర్లు భారీ క్రేన్ సాయంతో ఎమ్మెల్యే అన్నా, జంకెకు గజమాల వేశారు. ప్రచారంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు వెన్నా హనుమారెడ్డి, జెడ్పీటీసీ వెన్నా ఇందిర పాల్గొన్నారు.

ముస్లిం ఓటర్లంతా అన్నాకే మద్దతు



ప్రచారంలో పాల్గొన్న షంషేర్, ఇస్మాయిల్

● విస్తృతంగా మైనార్టీ నేతల ప్రచారం

మార్కాపురం టౌన్: ముస్లింల సంక్షేమానికి కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ముస్లిం ఓటర్లందరూ మద్దతు తెలుపుతారని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ అన్నారు. ముస్లిం మైనార్టీ నాయకులు పట్టణంలోని మక్కా మసీదు, మీనా మసీదు, విజయ టాకీస్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే అన్నా రాంబాబు విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలు వారికి ఘన స్వాగతం పలుకుతూ జై జగన్ అంటూ స్వాగతిస్తున్నారు. వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలతో పాటు పేద ముస్లింలకు రిజర్వేషన్ అమలు చేసినందున విద్య, వైద్య రంగాల్లో ముస్లిం విద్యార్థులు రాణిస్తున్నారన్నారు. గడచిన ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 55 లక్షల మంది మైనార్టీ సోదరుల అభివృద్ధికి కృషి చేశారని, డిప్యూటీ సీఎం పదవి కూడా ముస్లింలకు కేటాయించారని, దీంతో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్, డైరెక్టర్ల పదవులు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు ఇలా అనేక పదవులు ఇచ్చి గౌరవించారన్నారు. మైనార్టీలకు సాధికారత కల్పించిన ఘనత కూడా ముఖ్యమంత్రికే దక్కుతోందన్నారు. మార్కాపురంలో 2 కోట్లతో షాదీఖానా నిర్మాణం జరుగుతోందన్నారు. ఇలా మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెంటే తమ సోదరులు ఉన్నారన్నారు. అన్నా రాంబాబును గెలిపించాలని కోరారు. ఏఎంసీ డైరెక్టర్ డాక్టర్ మగ్బుల్ బాషా, ఎస్‌కే నజీర్ అహ్మద్, మున్సిపల్ కౌన్సిలర్ సలీం, కో ఆప్షన్ సభ్యులు అమీరుల్లాఖాన్, ఎస్‌కే కరీంబాషా, ఉస్మాన్, షెక్షావలి, ఖాలీద్, ఫరతుల్లా బేగ్, చాంద్‌బాషా, రహమతుల్లా, ఆసీఫ్‌ఖాన్, మౌలాలీ పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఏడు గేదెలు బలి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ ఏఈ

కొనకనమిట్ల: పొలాల్లో ఉన్న విద్యుత్ తీగలు తెగి కిందపడటంతో అటుగా పశువుల మేతకు వెళ్లిన 7 గేదెలు వాటిని తొక్కటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. ఈ సంఘటన మండలంలోని వాగుమడుగు పంచాయతీ అంబాపురం పొలాల్లో శనివారం జరిగింది. వివరాలు.. అంబాపురం ఎస్సీ కాలనీలోని పెరిక బుజ్జికి చెందిన 2 గేదెలు, పెరికె డానియేలుకు చెందిన 2 గేదెలు, పెరికె సువార్తమ్మకు చెందిన ఒక గేదె, పెరికె కొండయ్యకు చెందిన ఒక గేదె, పెరికె అబ్రహాంకు చెందిన ఒక గేదె పశువుల మేత కోసం పొలాలకు వెళ్లాయి. అంబాపురం–రేగడపల్లి వెళ్లే పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లు ప్రమాదవశాత్తు తెగి కిందపడ్డాయి. అటుగా వెళ్లిన గేదెలు కింద పడి ఉన్న తీగలను తొక్కడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయి. మృతి చెందిన గేదెలు విలువ సుమారు రూ.2.45 లక్షలు ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గేదెలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు నష్టపరిహారం ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు.

నిస్వార్థపరుడు అన్నాను గెలిపించాలి



ప్రచారంలో పాల్గొన్న అన్నా దుర్గాకుమారి

మార్కాపురం: నిస్వార్థంగా సేవచేసే వ్యక్తి అన్నా రాంబాబును భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు సతీమణి అన్నా దుర్గాకుమారి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె శనివారం పట్టణంలోని 9వ బ్లాకులో కౌన్సిలర్ సిరాజ్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత అన్నా రాంబాబు తీసుకుంటాడని, ఒంగోలు పార్లమెంటు అభివృద్ధి బాధ్యత డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తీసుకుంటారని పేర్కొన్నారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు బాగా జరిగాయని, వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో మరోసారి ఫ్యాను గుర్తుపై ఓటేసి అన్నా రాంబాబును, భాస్కర్‌రెడ్డిని దీవించి జగనన్నను సీఎంగా చేసుకోవాలన్నారు. గిద్దలూరు నియోజకవర్గాన్ని తన భర్త అన్నా రాంబాబు అన్నీ విధాలా అభివృద్ధి చేశాడని, మార్కాపురం నియోజకవర్గంలో కూడా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగి రాష్ట్రానికే మోడల్‌గా ఉంటాయని తెలిపారు. తమ కుటుంబం సేవా నిరతికి, సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త గోపాలుని హరిహరరావు, కౌన్సిలర్ కరీముల్లా, మాజీ వైస్ చైర్మన్ కుర్షీద్ అహ్మద్, రిటైర్డు పోస్టుమాస్టర్ సయ్యద్ సుభానీ, షేక్ మున్వర్, జి.నరసమ్మ, పోరుమామిళ్ల విజయలక్ష్మి, మల్లిక, సయ్యద్ నజీర్ అహ్మద్, రషీద్, షేక్ ఉస్మాన్ బాషా, నబీరసూల్, మహబూబ్‌బాషా, కరీముల్లా, బెల్లంకొండ సురేష్, ఉత్తమ్‌కుమార్, నాగేంద్ర, శంకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

రాచర్ల మండలంలో ఎన్నికల ప్రచారం

రాచర్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ సహకరించి మార్కాపురం ఎమ్మెల్యే, గిద్దలూరు నియోకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డిని భారీ మెజారీటితో గెలిపించాలని మండలంలోని అనుమలవీడు, అచ్చంపల్లె గ్రామాల్లో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. అంతేగాక పాలకవీడు పంచాయతీ పరిధి అనుమలవీడులో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సూర స్వామిరంగారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రతి గడపకు తిరుగుతూ నవరత్నాల పథకాల గురించి వివరిస్తూ ప్రచారం సాగించారు. అనంతరం ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి భారీ మెజారీటితో గెలిపించాలని కోరారు. ఒద్దులవాగుపల్లె సర్పంచ్ అన్నపురెడ్డి వెంకట రంగారెడ్డి, ఉప సర్పంచ్ కటారు నారాయణరెడ్డి ఎంపీటీసీ శనగ అరుణ, వైఎస్సార్ సీపీ నాయకులు బద్దెటి ప్రవీణ్‌కుమార్, సూర పాండురంగారెడ్డి, పిడతల సుబ్బారెడ్డి, చింతకుంట్ల ఇబ్రాహిం, సొంటం నెమిలిరెడ్డి, శనగ నాగయ్య పాల్గొన్నారు.

అన్నా, చెవిరెడ్డికి మద్దతుగా ప్రచారం



గొట్లగట్టులో మాట్లాడుతున్న నాయకులు

కొనకనమిట్ల: మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అన్నా రాంబాబు, ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి మద్దతు ఇచ్చి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరుతూ మండల వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. అన్నా, చెవిరెడ్డిల విజయాన్ని కాంక్షిస్తూ ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, మండల పార్టీ సమన్వయకర్త ఉడుముల గురవారెడ్డిల ఆధ్వర్యంలో గొట్లగట్టు, నాగంపల్లి, సలనూతల, వెలుగొండ్రాయునిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. అందరికీ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే అన్నా, చెవిరెడ్డిలను గెలిపిస్తే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండదండలతో నియోజకవర్గం రూపురేఖలు మారతాయని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, పార్టీ విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి ఏలూరి సంజీవరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు చిరుగూరి కోటేశ్వరరావు, నాయకులు పిన్నిక పిచ్చయ్య, గాడి కోనేటిరెడ్డి, గోనుగుంట్ల శ్రీనివాసులు, ఉప్పుటూరి పెద వెంకటయ్య, నాగం ప్రసాద్, డేవిడ్, అనిల్ ఉన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

గిద్దలూరు రూరల్: ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటిస్తూ విధులు నిర్వహించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సిద్ధార్థ్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఓపీఓలకు శనివారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఓపీఓల విధులు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు.

ముమ్మరంగా కల్పనారెడ్డి ఎన్నికల ప్రచారం



కంభంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి కల్పనారెడ్డి

కంభం: స్థానిక పంచాయతీ పరిధిలోని సంగావీధి, నాయక్ వీధి, జయప్రకాశ్ వీధి, శీలం వీధి, మేదర బజారులో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సతీమణి కల్పనారెడ్డి, సోదరిలు పద్మ, అరుణలు శనివారం ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేశారు. పేదల పక్షపాతిగా పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవడం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిలను మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. కందులాపురం పంచాయతీ పరిధిలోని పాత షుగరు ఫ్యాక్టరీ వీధి, పూసలబజారు, రావిపాడు రోడ్డు, మస్తాన్ స్వామి కొండ వీధిలో స్థానిక నాయకులు ప్రచారం చేశారు. రెండు చోట్ల జరిగిన ప్రచార కార్యక్రమంలో కంభం సర్పంచ్ పల్నాటి బోడయ్య, కందులాపురం సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ (రజని), చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం, కో ఆప్షన్ సభ్యుడు సలీం, వైస్ ఎంపీపీ రామ్మూర్తి, ఎంపీటీసీ రఫీ, కృష్ణ, హుస్సేన్ బాషా, ఆరీఫ్, శివారెడ్డి, సబ్బసాని సాంబశివారెడ్డి, తలపాటి అంకయ్య, గురవయ్య, ఖాసిం, అఫ్రోజ్, ప్రభాకర్, రసూల్, జేమ్స్, శ్రీనివాసాచారి, సుందరరావు, కొత్తూరు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో యంత్రాభిషేకం



విగ్రహాలకు యంత్రాభిషేకం చేస్తున్న వేదపండితులు

రాచర్ల: మండలంలోని సోమిదేవిపల్లెలో గణపతి, పోలేరమ్మ, అంకాలమ్మ, వీరభద్ర, నాగులమ్మ, నందీశ్వర, ప్రసన్నాంజనేయస్వామి, కాశీవిశ్వనాథ, మారెమ్మ, పోతురాజు, నాభి శిల, లక్ష్మీజగన్నాథ స్వామి, ధ్వజ, శిఖర ప్రతిష్ఠాత మహోత్సవం సందర్భంగా శనివారం దుర్భాక రామశాస్త్రి కుమారులు దుర్భాక ప్రవీణ్‌కుమార్ శాస్త్రీ ఆధ్వర్యంలో యంత్రాలకు అభిసేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రదోష పూజలు, అధివాస హోమాలు, ప్రధానన్యాస హోమాలు, రక్షా హోమం, ధాన్యాధివాసం, శయాధివాసాలు నిర్వహించారు. యంత్రాభిషేకం చూసేందుకు వచ్చిన భక్తులకు కామూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ధర్మకర్త మాదుగుళ్ల వెంటేశ్వరరెడ్డి, చైర్మన్ శీలం వెంగళరెడ్డి పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పేదల ఇంటి పెద్ద కొడుకు సీఎం జగన్

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

అర్ధవీడు (బేస్తవారిపేట): ప్రతి పేదవారి ఇంటికి పెద్ద కొడుకుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని వెలగలపాయ, గన్నెపల్లె, రంగాపురం, యాచవరం, పోతురాజుటూరు, మాగుటూరు, లక్ష్మీపురం, కాకర్ల, నాగులవరంలో ఆయన విస్తృత ప్రచారం చేశారు. జగనన్న ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి పేద, మధ్య తరగతి కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. పేదల ఆరోగ్య భద్రతకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచినట్లు తెలిపారు. వైఎస్సార్ పింఛన్ కానుకను రూ.3 వేలకు పెంచి లబ్ధిదారులకు ఎంతో ఆర్థి భరోసా కల్పించారన్నారు. జగనన్న పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి సమన్యాయం కల్పించారని వివరించారు. గతంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యమన్నారు. సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవడంతో సంక్షేమ పథకాలు గడప వద్దకే వస్తాయని వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ వెంకట్రావ్, జెడ్పీటీసీ చెన్ను విజయ, మాజీ ఎంపీపీ రవికుమార్ యాదవ్, వైస్ ఎంపీపీ సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ చేగిరెడ్డి పోతిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఏరువ కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు మునగాల వసంతమ్మ, నాగిరెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, గోదేశి రమణమ్మ, శ్రీనివాసులు, నాయకులు మధుమోహన్‌రెడ్డి, ఏ.కేశవరెడ్డి, ఎస్.చిన్న వెంకట సుబ్బారెడ్డి, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు



రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు అందజేస్తున్న వలంటీర్లు



ఎంపీడీఓ చందనకు వినతిపత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

బేస్తవారిపేట: మండలంలోని మండలంలోని చెట్టిచర్ల, మోక్షగుండానికి చెందిన 15 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. మోక్షగుండం సచివాలయం పరిధిలో 10 మంది, చెట్టిచర్ల సచివాలయం పరిధిలో ఐదుగురు వలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపీడీఓ పార్వతికి అందజేశారు. ప్రతిపక్ష పార్టీలు తమ పట్ల అనుచితంగా వ్యవహరించడం వల్లే మనస్తాపం చెందడంతో పాటు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు కొందరు వలంటీర్లు ప్రకటించారు.

కొమరోలు: మండలంలో గ్రామ వలంటీర్ల రాజీనామా పరంపర కొనసాగుతూనే ఉంది. మండలంలోని చింతలపల్లె గ్రామ సచివాలయం పరిధిలో ఇద్దరు గ్రామ వలంటీర్లు శనివారం రాజీనామా చేసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నరసింహారావుకు రాజీనామా పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న పాలన మళ్లీ రావాలని కోరుకుంటూ స్వచ్ఛందంగా వాలంటీర్లుగా రాజీనామా చేశామని, వైఎస్సార్ సీపీ గెలుపు కోసం కృషి చేస్తామని ప్రకటించారు.

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం నికరంపల్లి పంచాయితీ పరిధిలో 9 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ చందనకు శనివారం అందజేశారు. రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు వలంటీర్లుగా ఎంతో కృషి చేశామన్నారు. రానున్న రోజుల్లో పార్టీ అభివృద్ధి కోసం తమతో పాటు ప్రజలను చైతన్యం వంతం చేసి జగనన్నను రెండోసారి సీఎంగా గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు.

మేనిఫెస్టోతో మరింత సంక్షేమం



ఓట్లు అభ్యర్థిస్తున్న అనూష తదితరులు

పొదిలి: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం జగనన్న చెప్పిందే చేశారని, కొత్త మేనిఫెస్టోతో మరింత సంక్షేమం అందిస్తారని మార్కాపురం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అన్నా రాంబాబు కోడలు అన్నా అనూష చెప్పారు. శనివారం రాత్రి పట్టణంలోని పడమటిపాలెం, మసీదు తోట ప్రాంతాల్లో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. ప్రతి గృహంలోనూ మేలు జరిగిందని, దాంతోనే మీకు మేలు జరిగితేనే తనకు మద్దతు ఇవ్వాలని జగనన్న ధైర్యంగా కోరుతున్నారన్నారు. మహిళలకు అమలు చేస్తున్న పథకాల్లో వచ్చే లబ్ధి పెంచినట్లు చెప్పారు. దీంతో జగనన్న తిరిగి సీఎం అయితే మరింత సంక్షేమం అందుతుందన్నారు. చెప్పిన మాట మీద నిలబడే లక్షణం ఏ మాత్రం లేని చంద్రబాబు నాయుడు మాటలు నమ్మవద్దని మహిళా నాయకురాలు దోర్నాల వరలక్ష్మమ్మ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నమ్మించటం, మోసం చేయటం మాత్రమే బాబుకు తెలిసిన విద్య అన్నారు. ఇంటింటా తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయటం ద్వారా ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అనూష, పార్టీ నాయకులు కోరారు. మహిళల నుంచి అనూష ప్రచారానికి మంచి స్పందన లభించింది. రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి యక్కలి శేషగిరిరావు, జిల్లా కార్యదర్శి జి.చెన్నారెడ్డి, మాజీ ఎంపీటీసీ గౌసియా, శింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు యేబు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పంట దగ్ధం



పూర్తిగా దగ్ధమైన నన్నారి తోట

బేస్తవారిపేట: మండలంలోని చిన్న ఓబినేనిపల్లెలో విద్యుత్ షార్ట్ సర్క్యూతో సుగంధ గడ్డల(నన్నారి) తోట పూర్తిగా దగ్ధమైన సంఘటన శనివారం జరిగింది. బోర్లకు నూతనంగా విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసే సమయంలో ప్రమాదం జరిగినట్లు రైతు కొంగలవీటి లక్ష్మీరెడ్డి తెలిపారు. నన్నారి తోట, జామాయిల్ తోట, డ్రిప్ పైపులు, బోరు పైపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదంలో రూ.4 లక్షల నష్టం జరిగినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ శాఖ అధికారులు నష్టపరిహారం మంజూరు చేయించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

వైఎస్సార్ సీపీలోకి చేరికల జోరు



కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న టీడీపీ మాజీ సర్పంచ్ శింగరరెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని పిటికాయగుళ్లలో టీడీపీ మాజీ సర్పంచ్ నర్రా శింగరరెడ్డి, అతని అనుచరులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోదరుడు కుందూరు కృష్ణమోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ విజయం కోసం ప్రతి ఒక్కరం కష్టపడి పనిచేద్దామని, సంక్షేమం, అభివృద్ధి కోసం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, సర్పంచ్ నర్రా రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మల్లెల శేఖర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రశాంతంగా వినియోగించుకోవాలి

పొదిలి: ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవటానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై కోటయ్య అన్నారు. శనివారం రాత్రి స్థానిక పిచ్చిరెడ్డితోట కాలనీని సందర్శించి స్థానికులతో మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే, ఎవరైనా ఇబ్బందులు పెడుతుంటే తమ దృష్టికి తీసుకరావాలని కోరారు. ఓటర్లు, నాయకులు అందరూ సహకరించాలని ఆయన కోరారు.